జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 8 | మే | 2025 ◆ పేజీలు : 5



# ఆయువు తీస్తున్న ఆన్లైన్ బెట్టింగ్

- మోసాలతో యువత జాగ్రత్తగా ఉండాలి
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**కొత్తగూడెం క్రైమ్, మే 7, ప్రజాజ్యోతి :** సులభంగా డబ్బు వస్తుందని దురాశ తో ఆన్లైన్ బెట్టింగులు, గేములు, పేకాట, స్టాక్ మార్కెట్ ట్రేడింగులకు అలవాటు పడి సంపాదనంతా పోయి, అప్పులు తీర్చే మార్గం కానరాక ఆత్మహత్య లకు పాల్పడు తున్నారని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ మొదట్లో కొంత మేర డబ్బు ఆశ చూపి ఆన్లైన్ బెట్టింగ్, రమ్మి వంటి ఆటలు ఉత్తమ ఆదాయ మార్గమనే భ్రమను

మిగతా 5 లో...

# అవినీతిపరులకు... మురామేస్త్రీ



- అతను సింగరేణికి పట్టిన చీడ పురుగు
- అవినీతి ,అక్రమాలు,గుండాగిరితో చెలామణి
- బదిలీలు, కారుణ్య నియామకాల పేరిట అక్రమ వసూళ్లు
- ఎకౌంట్లో రెండు రూ.కోట్ల డబ్బు... విజిలెన్స్ శాఖ దాడులు అరెస్టు
- ఉద్యోగులపై, విలేకరులపై కూడా దాడులు
- నమోదైన పలు కేసులు...
- డిస్మిస్ అయినా సరే ఆగని అరాచకాలు..
- పలుమార్లు అరెస్టు, రిమాండ్..
- అనుచరుడి అరెస్టుతో మరోసారి బయటపడ్డ నికృష్టుని నిజ స్వరూపం
- కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్న కార్మిక లోకం

“రక్తాన్ని చెమటగా మలచి , భూగర్భం నుంచి బొగ్గు ఉత్పత్తులు సాధిస్తూ.. దేశానికి సేవ చేస్తున్న శ్రమ జీవులు గా, త్యాగధనులుగా గొప్ప కీర్తిని కలిగి ఉన్నారు సింగరేణి ఉద్యోగులు.అయితే అదే సింగరేణిలో అమాయక కార్మికులను మోసం చేస్తూ, కంపెనీ ప్రతిష్టను దిగజారుస్తూ, ప్రశ్నించిన వారిపై గుండాగిరి చెలాయిస్తు బతుకుతున్న దుర్మార్గులు కూడా కొందరు లేకపోలేదు.. వీరి సంఖ్య చాలా తక్కువే అయినప్పటికీ,వీరు సింగరేణి మహావృక్షానికి పట్టిన చీడ పురుగులు, కార్మికుల రక్త మాంసాలు తాగే జలగలు గా జనం చెప్ప కుంటున్నారు. ఇటువంటి వారిని కూక టివేళ్లతో ఏరి పారేయాలని సింగరేణి యాజమాన్యం సైతం బలంగా సంకల్పించింది. ఈ వ్యవహారంలో సింగరేణి నిఘా వ్యవస్థకు, అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికిన అతిపెద్ద మూటనే... న్యాయవాది ముసుగులో చలామణి అవుతున్న "సంపతుడి" అనుచరుడు అన్నబోయిన రాజేశ్వరరావు. ఇక్కడనుండి తీగల లాగితే.. ఆ మురామేస్త్రి డొంక మొత్తం కదులుతోంది. దీనిపై ప్రజా జ్యోతి చేసిన లోతైన పరిశోధనలో ఆ మురామేస్త్రి చేసిన అక్రమాలు, అవకతవకలు, అన్యాయాల గురించి అనేక నిబ్బరబోయే నిజాలు బయటపడ్డాయి.”




2 లో..

◆ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

# సింగరేణిలో అవినీతి దందాలపై ఉక్కు పాదం

- అవినీతి, అక్రమార్కులపై ధైర్యంగా సమాచారం ఇవ్వండి
- ఎంతటి వారైనా ఉపేక్షించే సమస్యే లేదు
- మోసగాళ్ల సమాచారాన్ని సింగరేణి విజిలెన్స్, ఏసీబీ కి అందించండి
- సమాచారం ఇచ్చిన వారికి పూర్తి రక్షణ, వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం
- ఆధారాలతో అక్ర మార్కులను పట్టించిన వారికి రూ.10 వేల పారితోషకం



- సింగరేణి ఉద్యోగులకు యాజమాన్యం పిలుపు

**కొత్తగూడెం సింగరేణి , మే 07, ప్రజాజ్యోతి:** శ్రమకు మారుపేరుగా నిలుస్తూ,దేశానికి వెలుగులు అందిస్తున్నసింగరేణిసంస్థలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కొన్ని అరాచక శక్తులను ఇప్పటికే ఏరివేయడం జరిగిందని, ఇంకా ఇటువంటి అవినీతి దందాలు నడిపే వారికి సంబంధించిన, వెనక ఉండి నడిపిస్తున్న వారి

మిగతా 5 లో...

# ఫలించిన ఎమ్మెల్యే కూనంనేని కృషి

- నీటి ఎద్దడి నివారణకు 8.92కోట్ల డిఎంఎఫ్టి నిధులు మంజూరు
- తీరనున్న నియోజకవర్గ ప్రజల నీటి కష్టాలు
- త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిస్కారం : ఎమ్మెల్యే కూనంనేని



**కొత్తగూడెం, మే 7, ప్రజాజ్యోతి :** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపెట్టాలనే లక్ష్యంతో స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు చేసిన కృషి ఫలించింది. కూనంనేని ప్రతిపాదన మేరకు నియోజకవర్గలో నీటి సమస్య పరిస్కారంకోసం డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ఫండ్ (డిఎంఎఫ్టి) ద్వారా రూ.8.92 కోట్లు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వలు జారీ అయ్యాయి. ఈ నిధులతో ట్యాంకులు, పంపు హౌజులు, సంపులు, నూతన పైపు లైన్లు, పైపులైన్ల మరమ్మత్తులు, బోర్లు ఏర్పాటు చేయనున్నారు. కోయగూడెం, సోలెంగుంపు, శేషయ్య గుంపు, ఉప్పరిగూడెం, నర్సింహసాగర్, నారంగ్ తండా, నిమ్మలగూడెం, సింగభూపాలెం, పెనుబల్లి, సాటి వారిగూడెం, కరిగేట్టు, సరెకల్లు గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్య పరిస్కారంకోసం

మిగతా 5 లో...



# అవినీతిపరులకు... ముఠామేస్త్రీ

- అతను సింగరేణికి పట్టిన చీడ పురుగు
- అవినీతి ,అక్రమాలు,గుండాగిరితో చెలామణి
- బదిలీలు, కారుణ్య నియామకాల పేరిట అక్రమ వసూళ్లు
- ఎకౌంట్లో రెండు రూ.కోట్ల డబ్బు... విజిలెన్స్ శాఖ దాడులు అరెస్టు
- ఉద్యోగులపై, విలేకరులపై కూడా దాడులు
- నమోదైన పలు కేసులు...
- డిస్మిస్ అయినా సరే ఆగని అరాచకాలు..
- పలుమార్లు అరెస్టు, రిమాండ్..
- అనుచరుడి అరెస్టుతో మరోసారి బయటపడ్డ నికృష్టుని నిజ స్వరూపం
- కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్న కార్మిక లోకం

**"రక్తాన్ని చెమటగా మలచి , భూగర్భం నుంచి బొగ్గు ఉత్పత్తులు సాధిస్తూ.. దేశానికి సేవ చేస్తున్న శ్రమ జీవులు గా, త్యాగధనులుగా గొప్ప కీర్తిని కలిగి ఉన్నారు సింగరేణి ఉద్యోగులు.అయితే అదే సింగరేణిలో అమాయక కార్మికులను మోసం చేస్తూ, కంపెనీ ప్రతిష్టను దిగజారుస్తూ, ప్రశ్నించిన వారిపై గుండాగిరి చెలాయిస్తు బతుకుతున్న దుర్మార్గులు కూడా కొందరు లేకపోలేదు.. వీరి సంఖ్య చాలా తక్కువే అయినప్పటికీ,వీరు సింగరేణి మహావృక్షానికి పట్టిన చీడ పురుగులు, కార్మికుల రక్త మాంసాలు తాగే జలగలు గా జనం చెప్పకుంటున్నారు. ఇటువంటి వారిని కూకటివేళ్లతో ఏరి పారేయాలని సింగరేణి యాజమాన్యం సైతం బలంగా సంకల్పించింది. ఈ వ్యవహారంలో సింగరేణి నిఘా వ్యవస్థకు, అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికిన అతిపెద్ద మూటనే... న్యాయవాది ముసుగులో చలామణి అవుతున్న "సంపతుడి" అనుచరుడు అన్నబోయిన రాజేశ్వరరావు. ఇక్కడనుండి తీగల లాగితే.. ఆ ముఠామేస్త్రి డొంక మొత్తం కదులుతోంది. దీనిపై ప్రజా జ్యోతి చేసిన లోతైన పరిశోధనలో ఆ ముఠామేస్త్రి చేసిన అక్రమాలు, అవకతవకలు, అన్యాయాల గురించి అనేక నిబ్బరబోయే నిజాలు బయటపడ్డాయి."**



◆ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## బ్లాక్ మెయిలింగ్ ఆక్రముడు..

కొత్తగూడెం ఏరియాలో, ఆ మాటకొస్తే సింగరేణిలో అవినీతి , బ్లాక్ మెయిలింగు, గుండా గిరి చెలాయించిన ఒక ఘరానా మోసగాడి పేరు చెప్పమంటే సామాన్య కార్మికుడు కూడా అతని పేరును వెంటనే చెప్పేస్తాడు. అతనే అవినీతి పరులకు ముఠామేస్త్రి సంపతుడు. సింగరేణి సంస్థ నుండి క్రమశిక్షణ చర్యల కింద సస్పెండ్ అయ్యి , చివరికి డిస్మిస్ అయిన మాజీ క్లర్కు . కార్మికులే కాదు కార్మిక సంఘాలు కూడా ఛీకొట్టి వెళ్లగొట్టినప్పటికీ, అక్రమాలు నిరూపించబడి డిస్మిస్ అయినప్పటికీ.. అతని దుర్బుద్ధి మాత్రం మారలేదు. తన అనుచరులతో అ

ఎంతటి అవినీతి దందానైనా నడుపుతూ.. ఇటు కంపెనీకి, అటు పోలీసు వ్యవస్థకు తలనొప్పిగా మారాడు. ఇటీవల ఇతని అనుచరుడు అయినాల రాజేశ్వర్ అనే అతను ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ బ్రోకర్ అవతార మెత్తి సుమారు 50 మందికి పైగా అమాయక కార్మికులను మోసగించి 50 లక్షలకు పైగా వసూలు చేసిన విషయం బహిర్గతమైంది. దీనిపై పోలీసులు లోతుగా ఆరా తీయగా ఇతనికి అవినీతికి.. ముఠామేస్త్రి సంపతుడికి 20 ఏళ్ల అనుబంధం ఉందని, ఈ నేరంలో కూడా అతనికి భాగస్వామ్యం ఉందని బలంగా అనుమానిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు పై రాజేశ్వరరావును పోలీసులు పట్టుకున్నారు. దీంతో మరోసారి అవినీతి పరులకు ముఠామేస్త్రి సంపతుడి అవినీతి అక్రమాలపై కార్మిక లోకంలో చర్చ నడుస్తోంది .

## ఎవరి సంపతుడు..? ఏమిటి అతని అక్రమ చరిత్ర.. ?

1987లో క్లర్క్ గా సింగరేణిలో చేరిన ఈ ముఠామేస్త్రి మొదటినుంచి తన వంకర నడవడికతో ఇటు కార్మికుల్ని, అటు యాజమాన్యాన్ని ఇబ్బందులు పెడుతూ వచ్చాడు. ఈఅవినీతిపరుల ముఠామేస్త్రి పై ప్రజాజ్యోతి చేసిన పరిశీలనలో తెలిన కొన్ని అంశాలు :

👉 1989లో కంపెనీ సెంటినరీ సంవత్సరంలో పెద్ద ఎత్తున రిక్రూట్మెంట్ జరుగుతుండగా ఉద్యోగాలు ఇప్పిస్తానని పరుగులు దగ్గర డబ్బులు తీసుకొని మోసం చేసిన ఆరోపణలు ఉన్నాయి.

👉 ఈ నేపథ్యంలో బదిలీ అయిన అతను సెంట్రల్ వర్క్ షాప్ లో పైపుల దొంగతనం కేసులో విజిలెన్స్ వారికి దొరికిపోగా.. తదుపరిగా డబ్బులు రికవరీ చేశారు.

👉 అనేక నిగూడసమాచారం , ఫైళ్లు నిర్వహించే కీలకమైన పర్సనల్ డిపార్ట్మెంట్లో కూడా అతను అనేక గోప్యనీయ విషయాలను బయటి వారికి చేరవేయడం,ఇదేమిటి అని ప్రశ్నించిన అధికారులను బ్లాక్ చేయడం వంటి అక్రమాలకు పాల్పడ్డాడు అని తెలిసింది.

👉 ఆ క్రమంలో దీనిని గమనించిన ఉన్నత అధికారు ఇతనినీ వేరే ఏరియాకి బదిలీ చేశారు.

👉 అయినప్పటికీ ఇతను కార్మిక సంఘాలను మభ్యపెట్టి, ప్రలోభ పెట్టి తిరిగి కొత్తగూడెం బదిలీ అయి వచ్చాడు. అప్పటికి మనోడి బుద్ధి మారలేదు.

👉 2002లో కొత్తగూడెం ఏరియాకి సంబంధించి పెట్రోల్ బంకులలో పనిచేస్తూ ఇద్దరు కార్మికులపై దాడి చేయడం. అది మాత్రమే కాక పెట్రోల్ పోయడం లో చేతి వాటం చూపి సొంతానికి వాడుకున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి.

👉 బెదిరించడం , గ్రూపులు నిర్వహించడం లో దిట్ట అయిన ఇతను సిఆర్ క్లబ్ కు సెక్రటరీగా ఎంపికై అక్కడ కూడా కార్మికుల సౌకర్యం కోసం కంపెనీ ఇచ్చే సొమ్మును ఫంక్షన్ల పేరిట వచ్చే డబ్బును స్వాహా చేశాడన్న ఆరోపణపై టిఎన్టియుసి నాయకులు పెద్ద పోరాటం చేశారు.

👉 యాజమాన్యం దీనిపై వివరణ కోరినప్పటికీ ఇతను పెడచెవిని పెట్టడంతో సమాచార హక్కు చట్టం కింద ఇతని అక్రమాలను బట్టబయలు చేశారని ప్రజా జ్యోతి పరిశీలనలో తేలింది.

👉 ముఖ్యంగా బదిలీలు చేయిస్తాను , ఉద్యోగాలు ఇప్పిస్తాను అంటూ ఇతను పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడి నట్లు సమాచారం అందుకున్న హెడ్ ఆఫీస్ ఉద్యోగుల సంఘం హెచ్ఎంఎస్ కార్మిక సంఘం వారు 2012లో యాజమాన్యానికి కేంద్ర, విజిలెన్స్ కమిషన్ కు ఇతడి పై ఫిర్యాదు చేశారు.

👉 దీనిపై జరిగిన దర్యాప్తులో కేవలం క్లర్క్ గా పనిచేస్తున్న అతని ఖాతాలో రెండు కోట్ల రూపాయల సొమ్ము డిపాజిట్ అయిందని గుర్తించారు. దీనితో యాజమాన్యం చర్యలు తీసుకుంది.

👉 ఈ అక్రమార్కుల ముఠామేస్త్రిని ను ఎవరు ప్రశ్నించిన సరే వాళ్లపై దాడులు జరుగుతుండేవి. కొన్నిసార్లు తాను, తన అనుచరులతో ఈ దాడులు చేస్తుండేవాడు. కార్మికులపైనే కాక విలేకరుల పైన కూడా దాడులు జరిపిన సందర్భాలు ఉన్నాయి. ఇతని వ్యవహారాన్ని ప్రజా జ్యోతి ఎంతో లోతుగా పరిశీలించింది.

👉 2012లో విలేకరులపై దాడి జరిగిన నేపథ్యంలో కొత్తగూడెం ప్రెస్ క్లబ్ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమాలకుడినీ అరెస్టు చేసినట్లు తెలిసింది.

👉 సంస్థలో ఉన్నన్ని రోజులు డ్యూటీలకు ఎగనామం పెట్టి సొంత పనులు, పైరవీలు జరుపుకునే ఈ మహాశయుడు, తాను నెలలో అన్ని రోజులు పనిచేసినట్లు హాజరు నమోదు చేసుకునేవాడు. విచిత్రం ఏమిటంటే అతని పెళ్లి రోజు, ఆయన తండ్రి చనిపోయిన రోజు కూడా పూర్తి పనిగంటలు విధుల్లో ఉన్నట్టు బోగస్ అటెండెన్స్ సృష్టించుకున్న ఘనత మనోడిదని ప్రజా జ్యోతి పసిగట్టింది.

👉 దీనినీ కొందరు కార్మిక సంఘాల నాయకులు బయట పెట్టగా వారిని చంపుతామని బెదిరించడం కూడా అప్పట్లో చచ్చే అంశంగా మారింది.

👉 సింగరేణి కారుణ్య నియామకాల లో అన్ఫిట్ చేయిస్తానని పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదు రాగా దీనిపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన తెలంగాణ దళిత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె .శ్రీనివాసులును కూడా ఫోన్ ద్వారా బెదిరించగా, కొత్తగూడెం పోలీస్ స్టేషన్లో టెలికం యాక్ట్ ప్రకారం కేసు కూడా నమోదయింది.

👉 ఈ అవినీతిపరుడు అక్రమాలు, అవినీతిని కాపాడుకునేందుకు దాదాపు అన్ని కార్మిక సంఘాలను ఆశ్రయిస్తూ వచ్చాడు. కానీ ఇతని దుర్బుద్ధిని, గుండాగిరిని భరించలేక ఆ కార్మిక సంఘాలన్నీ ఇతన్ని బయటకు గెంటివేసాయి.

👉 అతని అక్రమాలు పుట్టలు గుట్టలుగా పెరుగుతూ పోవడంతో యాజమాన్యం ఇతని మరోసారి 2017 ఫిబ్రవరి 1న బెల్లంపల్లికి ట్రాన్స్ఫర్ చేసింది.

👉 అయినా సరే ఈ సంపతుడికి అవినీతికి కేంద్రమైన కొత్తగూడెం ప్రాంతాన్ని వదలడం ఇష్టం లేక ఇక్కడే ఉంటూ పైరవీలు మొదలుపెట్టాడు., యాజమాన్యం ఉత్తర్వులను బేఖాతరు చేస్తూఉద్యోగం లో చేరకపోవడం తో నిబంధనల ప్రకారం అతన్ని కంపెనీ ఆ సమయంలో డిస్మిస్ చేసింది.

👉 డిస్మిస్ అయినా సరే మళ్లీ తన దందాను కొనసాగించడంతో ఫిబ్రవరి, 2019 న రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ వారు అతన్ని అరెస్ట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇతని అవినీతి జాతకం మొత్తం బయటపడింది.

ఇటువంటి వారు తిరిగి తమ అనుచరులతో కంపెనీ వ్యవహారాల్లో తల దూర్చి, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నందున వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్మికలోకం కార్మిక సంఘాలకు కోరుతున్నాయి.



# యాదవులు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా అభివృద్ధి చెందాలి

## చలకాని వెంకట్ యాదవ్



**భద్రాచలం టౌన్, మే 7, ప్రజాజ్యోతి :** యాదవులు ఆర్థికంగా రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు చలకాని వెంకట్ యాదవ్ అన్నారు. భద్రాచలం పట్టణంలోని రామాలయం రోడ్డులో శ్రీకృష్ణ మందిరంలో బుధవారం జరిగిన యాదవ సంఘం రాజకీయ అవగాహన తరగతుల్లో అయన పాల్గొని మాట్లాడుతూ అన్ని రంగాలలో యాదవులు ముందు ఉండాలన్నారు. నిరుపేద యాదవ విద్యార్థుల చదువు కోసం కూడా సంఘం ఆధ్వర్యంలో ఆర్థికంగా సహాయం చేయాలన్నారు. ఓట్లు మావి సీట్లు మీవానే నినాదంతో మన జనాభా ప్రకారం మనకు వాటా వచ్చేలా డిమాండ్ చేయాలన్నారు. విద్యావంతల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ సీతారాములు యాదవ్ మాట్లాడుతూ యాదవ్ జాతి మొత్తం కూడా ఐక్యంగా ఉండాలని, సమాజంలో మంచి గుర్తింపు పొందాలని, యాదవుల కోసం తాను కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు . ఈ కార్యక్రమంలో భద్రాచలం పట్టణ అధ్యక్షులు జెట్టి రామకృష్ణ యాదవ్, గోసుల శ్రీనివాస్ యాదవ్, నక్క సాయిరాం యాదవ్, కుమ్మరి కుంట సాంబ శివరావు యాదవ్ శ్రీరామ్ యాదవ్, మేకల మల్లీ బాబు యాదవ్, భద్రాచలం పట్టణం, చుట్టుపక్కల గ్రామాల నుండి యాదవ మిత్రులు హాజరయ్యారు.

# దెబ్బకి దెబ్బ తీసిన భారత సైనికులకు నా సెల్యూట్ : ఆళ్ళ మురళి



**కొత్తగూడెం, మే 7 ప్రజా జ్యోతి :** భారత ఆర్మీ అమలు చేసిన ఆపరేషన్ సింధూర్ ద్వారా పాకిస్తాన్‌లో ఉన్న 9 ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేయడం భారత ప్రజలందరికీ గర్వకారణమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి అన్నారు. దేశాన్ని కాపాడేం దుకు ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న మన భారత ఆర్మీ జవాన్లకు ఆయన హృదయ పూర్వక అభినందనలు తెలిపి వారికి ఘనంగా సెల్యూట్ చేశారు. మన దేశ ఆర్మీ తలుచుకుంటే పాకిస్తా న్‌ను చీమల మాదిరిగా నలిపేయగలదన్న విషయాన్ని ఈ ఆపరేషన్ ద్వారా దేశ శత్రువులకు స్పష్టమైన సందేశం ఇచ్చిందన్నారు. ఏనాడు అనవసరంగా భారతదేశం వేరే దేశాలపైకి దాడి చేయలేదని, అదే సమయంలో మన దేశంలో అమాయకుల పట్ల ముష్కరులు చేసే దాడులకు ధీటైన సమాధానం ఇవ్వడంలో వెనుకడుగు వేయదన్నారు. భారతదేశం మౌనంగా ఉందంటే అది బలహీనత కాదని మన సహనమన్నారు. పహల్గాం లాంటి ఘటనలు మళ్లీ తలెత్తే పరిస్థితి వస్తే, ఈసారి భారతదేశ ఆర్మీ చేతిలో పాకిస్తాన్ బలి అవ్వ క తప్పదన్నారు. పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్రవాదకు ఇది గట్టి హెచ్చరిక అన్నారు.

# స్వతంత్రం ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి

- టిపిజిఎస్ జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య



**భద్రాచలం టౌన్, మే 7, ప్రజాజ్యోతి :** అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా భద్రాచలం పట్టణం లో అంబేద్కర్ సెంటర్లో ఉన్న మన్యం వీరులు అల్లూరి సీతారామరాజు, గాం గంటం దొర, గాం మల్లు దొర విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు దేశ స్వతంత్రం కోసం తెల్లదొరల ను తరిమి కొట్టిన మహా గొప్ప విప్లవకారుడు అని, ఆయన స్ఫూర్తితో భవిష్యత్తు ఆదివాసి హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా అల్లూరి సీతా రామరాజు తో పాటు గంటందొర, మల్లు దొర కూడా అల్లూరి తోపాటు స్వతంత్ర ఉద్యమంలో, గిరిజన హక్కుల కోసం పోరాటం చేసిన విప్లవ వీరులని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రానున్న కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కులు చట్టాలను కాలరాస్తున్నటువంటి ఈ తరుణంలో ఆదివాసీలందరూ ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం కార్యదర్శి కుంజా శ్రీను, నాయకులు చంద్ర భూపేందర్, కొర్స రవి, నవీన్ గణేష్, ప్రవీణ్, సుబ్బు జోగారావు తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఉద్యమించాలి

- భద్రాచలం ఆదివాసీ సమితి కార్యదర్శి పాయం రవివర్మ



**భద్రాచలం టౌన్,మే 7, ప్రజాజ్యోతి :** మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు స్ఫూర్తితో ఆదివాసీల హక్కుల కోసం ఉద్యమించాలని ఆదివాసీ సమితి నాయకులు పాయం రవివర్మ అన్నారు. అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా బుధవారం భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్లో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఆదివాసీ సమితి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటీషవారి ఆగడాలను, దోపిడీని అరికట్టడం కోసం ఆదివాసీ ప్రాంతంలో అందరిని ఐకమత్యం చేసి పోరాట స్ఫూర్తిని నింపి అలుపెరగని పోరాటం సాగించిన గొప్ప మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఆయన స్ఫూర్తి పోరాటాల ఫలితంగా నేడు అనుభవిస్తున్న చట్టాలను రక్షించడం కోసం, అమలు పరచడం కోసం ఆయన స్ఫూర్తితో ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సమితి ముఖ్యసలహాదారులు కుంజా ధర్మా, పూనెం వీరభద్రం, ఉపాధ్యక్షులు కోండ్రు సుధారాణి, వీసాల కృష్ణయ్య, కుంజా శ్రీను, ఇర్పా శ్రీను, సోయం రామ్మూర్తి, పాయం రాజేందర్ పాల్గొన్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతి

- నివాళులు అర్పించిన బీజేపీ నాయకులు



**భద్రాచలం టౌన్,మే 7, ప్రజాజ్యోతి :** భద్రాచలం బీజేపి మండల కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ సమీపంలో అల్లూరి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కుంజా ధర్మా మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు త్యాగాలు మనందరికీ మార్గదర్శకం అని, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. అల్లూరి మన్యం ప్రాంత ప్రజలను చైతన్యపరచి, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించరని, తెల్లదొరల ముందు బాణాలు, అరిసెలు పనిచేయవని తెలుసుకొని, ఆయుధాల కోసం 1922 ఆగష్టు 22 నుండి 25 వరకు కృష్ణదేవిపట్నం, అడ్డతీగల, చింతపల్లి, రంపచోడవరం పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి తుపాకులు సాధించారని, తుపాకులతో ఆయుధ సాధన చేసి ఉద్యమాన్ని ముందుకు నడిపారని అన్నారు. చివరికి బ్రిటిష్ వారు ఆయన్ని అమానుషంగా కాల్చి చంపినా, ఆయన త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది అన్నారు. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్ వంటి ప్రముఖులు కూడా ఆయన వీరత్వాన్ని అభినందించారు అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపి మండల అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ నిడదవోలు నాగబాబు, సీనియర్ నాయకులు ములిశెట్ట రాంమోహన్ రావు, చెల్లిబోయిన వెంకన్న, ముత్యాల చంద్రశేఖర్, చక్రవర్తి, అల్లాడి సుబ్బారావు, సురేష్, సోషల్ మీడియా సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిపల్లి మండల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన డిఎస్పి





**లక్ష్మీదేవిపల్లి, 07 మే, ప్రజాజ్యోతి :** లక్ష్మీదేవిపల్లి మండల పోలీసు స్టేషన్ ను కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పెండిం గ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్ ఐ రమణ రెడ్డి నీ ఆదేశించారు. అలాగే స్టేషన్ పరిసరాలను పరిశీలించి సీజ్ చేసిన వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధి నిర్వహణలో ముం దుండాలన్నారు. బ్లూ కోర్ట్ సిబ్బంది ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని మండలం మొత్తం తిరుగుతూ అసాంఘిక కార్యకలాలపై దృష్టి సాధించాలని ఆదేశించారు.అనంతరం మండలం లోని వేపలగడ్డ గ్రామంలో సైబర్ జాగృతి కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సర్కిల్ సీఐ రాయల వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి, ప్రొబిషనరీ ఎస్సై విజయసింహారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు పార్టీ వెంటే బడుగు, బలహీన వర్గాలు

- దళిత కాలనీల అభివృద్ధి, మౌలిక వసతులకోసం కృషి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా



**కొత్తగూడెం, మే 7, ప్రజాజ్యోతి :** నియోజకవర్గ పరిధిలోని దళిత, గిరిజన కాలనీలు, గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని, అయన కృషికి సహకారం అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె . సాబీర్ పాషా అన్నారు. పట్టణ పరిధిలోని పాత కొత్తగూడెం ఎస్సి కాలనీ పార్టీ శాఖా సమావేశం నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాబీర్ పాషా కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. గ్రామాలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజా ప్రతినిధులకె పేదలు కష్టాలు తెలుసని స్పష్టం చేశారు. కమ్యూనిస్టు పార్టీ వెంటే పేద, బడుగు, బలహీన వర్గాలు ఉంటారని, పార్టీకి వారే బలమన్నారు. సమస్యలను గుర్తించి చైతన్యవంతమైన ఉద్యమాలు, పోరాటాలు చేయడం ద్వారానే పరిష్కారం లభిస్తుందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో భవాని, కిలారు ప్రసాద్, కళ్లకుల భాస్కర్, నాగేందర్, రామారావు, బండి మంగ, గుర్రం వెంకటేశ్వర్లు, అంజి, జ్యోతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం



**భద్రాచలం కల్చరల్ , మే 7, ప్రజాజ్యోతి :** శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో బుధవారం అంతరాలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి



**భద్రాచలం , మే 7, ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్ లో సుమారు కోటి 24 లక్షల రూపాయలతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్లు , డ్రైనేజీ పనులకు బుధవారం రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార , పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జేసీబీ తగిలి వ్యక్తి మృతి



**భద్రాచలం, మే 7, ప్రజాజ్యోతి :** భద్రాచలంకు చెందిన ఇసుక వ్యాపారి అంబికావాసు ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. యటపాక వద్ద పల్టీకొట్టిన తన లారీని లేపేందుకు జేసీబీ సహాయంతో పనులు నిర్వహిస్తున్న సమయంలో లారీని లేపే క్రమంలో ఉండగా జేసీబీ తగలడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో అతన్ని పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించగా మృతి చెందారు. అంబికా వాసు పట్టణంలోని అందరికీ సుపరిచితులు.

## గోదావరి స్నాన ఘట్టాల వద్ద ఐరన్ మెష్ల చోరీ

**భద్రాచలం,7మే, ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని గోదావరి ఒడ్డున ఉన్న ఐరన్ మెష్ లను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసారు. ఈ చోరీ చేసిన ముగ్గురు వ్యక్తుల కదలికలు సమీపంలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. కాగా దొంగతనంకు సంబంధించిన విషయమై గజ ఈతగాళ్లు స్థానిక పోలీసు స్టేషన్ కు సమాచారం ఇచ్చారు.

## సింగరేణి నీ కాపాడుకుందాం

- మే 20 న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలని సిఐటీయూ పిలుపు



**టేకులపల్లి, మే07,ప్రజాజ్యోతి:** సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఇల్లందు బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో కోయగూడెం ఓసీలో మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిట్ మీటింగ్ బ్రాంచి కార్యదర్శి ఎం డి అబ్బాస్ ఆధ్వర్యంలో సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత చట్టబద్ధత కలిగినటువంటి 29 కార్మిక చట్టాలనురద్దు చేశారని వాటి స్థానే తెచ్చిన చట్టబద్ధతలేని 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, బొగ్గు పరిశ్రమను ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ చేయకూడదాని,కమర్షియల్ మైనింగ్ రద్దు చేసి ప్రభుత్వం ఆధ్వర్యంలో నడపాలి, సింగరేణికి కొత్త బ్లాకులు కేటాయించి,బొగ్గును సింగరేణి సంస్థ ద్వారా తీయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ రద్దుచేయాలని. కోల్ ఇండియా నుండి సింగరేణి బొగ్గు పరిశ్రమను విడగొట్టే ఆలోచన మానుకోవాలి.కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని. కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలని. కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యా వైద్యం అందిం చాలని. తదితర డిమాండ్ల సాధన కోసం సింగరేణిలోని సంఘటిత అసంఘటిత రంగ కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని సమ్మెను విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ వరంగంటి రాజమొ గిలి, ఆర్ బీ జనార్ధన్ రాజు, ఎం డి అబ్బాస్ సిరాజ్ అహ్మద్, కడుదల వీరన్న, ఈసం నరసింహ రావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానం నూతన పాలకవర్గం ఎన్నిక





- ఎమ్మెల్యే జారే సమక్షంలో ప్రమాణ స్వీకారం

**అన్నపురెడ్డిపల్లి, మే 7, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం మరియు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానమునకు ఈ రోజున నూతన పాలక మండలిని ఏర్పాటు చేయడం జరిగినది. ఈ పాలకమండలి ప్రమాణస్వీకారం ఉదయం 10:30 గంటలకు జరిగినది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ పాలకమండలిలో చైర్మన్ గా మల్లెల నరసింహారావు ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కమిటీ సభ్యులుగా గుజ్జ పూర్ణచంద్రరావు, రుంజ బుచ్చమ్మ,



నల్లవెల్లి వెంకటేశ్వర్లు, మాయర కృష్ణయ్య, కేసరి కృష్ణయ్య, బోయినపల్లి వెంకటేశ్వర్లు ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమితులైన వీరికి దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ బెల్ సింగ్ నూతన కమిటీ సభ్యులకు ప్రమాణ స్వీకారం నిర్వహించి ఉన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆలయ చైర్మన్ మల్లెల నరసింహారావు మాట్లాడుతూ మా నాయిని బ్రాహ్మణ వారిని గుర్తించి ఈ పదవిని నాకు



ఇవ్వటానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు మరియు ఈ గుడిని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడుపుతానని తెలిపారు. చైర్మన్ పదవి చేపట్టిన సందర్భంగా మల్లెల నరసింహారావు, సామ్రాజ్యం దంపతులు అన్నపురెడ్డిపల్లి గ్రామానికి ఫ్రీజర్ వారి గుర్తుగా ఎమ్మెల్యే జారే చేతుల మీదుగా అన్నపురెడ్డిపల్లి గ్రామస్తులకు ఇచ్చారు. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ,నాయిని బ్రాహ్మణ సంఘం నాయకులు, కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా...ఆరాధోత్సవం

- ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం




**టేకులపల్లి, మే07, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమై మంగళ తోరణం కట్టడం జెండా ఊరేగింపు, ఆవిష్కరణ, శ్రీ గోవింద మాంబా సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారికి నవనీతఅభిషేకములు, అలంకరణలు ,మహా నివేదన , మహా మంత్రపుష్పం ,మంగళ నీరాజనం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. టేకులపల్లి బ్రాహ్మణ గారి దేవాలయ కమిటీ మధ్యాహ్నం 12:30 గంటలకు నుండి అన్నదాన మహోత్సవం నిర్వహించారు.

## 17.5 కేజీల గంజాయి పట్టివేత

- బజాజ్ పల్సర్ స్వాధీనం, ఇద్దరి అరెస్ట్



**భద్రాచలం ,మే 7,ప్రజాజ్యోతి :** ఆంధ్ర–ఒరిస్సా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి భద్రాచలం మీదుగా బజాజ్ పల్సర్ బండిలో గోదావరిఖని కి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని బుధవారం జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీం పోలీసులు పట్టుకున్నారు.గంజాయి అక్రమ రవాణా సమాచారం మేరకు, కొత్తగూడెం ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీమ్ భద్రాచలం లోని కూనవరం రోడ్డు లో తనిఖీలు చేపట్టి అక్రమ రవాణా గుర్తించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ద్విచక్ర వాహనం (బజాజ్ పల్సర్) మరియు ఎండు గంజాయిని, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొన్నారు. గంజాయి తూకం వేయగా 17.5 కేజీలు ఉన్నట్లు దాని విలువ 8.75 లక్షలుగా నిర్ధారించారు.ఈ తనిఖీల్లో ఎస్.ఐ గౌతమ్ సిబ్బంది రామకృష్ణ గౌడ్, హబీబ్ పాషా, వెంకట నారాయణ, సుమంత్, శ్రావణి, పార్థసారథి, రమేష్ పాల్గొన్నారు.

## వారపు సొంత బహిరంగ వేలం

**అశ్వారావుపేట, మే 07, ప్రజాజ్యోతి :** మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సుజాత అధ్యక్షతన బుధవారం వారపు సంత వేలంపాటను నిర్వహించారు. 2025, 26 సంవత్సరానికి గాను సంతలో దుకాణాల సముదాయానికి బహిరంగ వేలం నిర్వహించగా పట్టణానికి చెందిన కాంద్రకోట ఉదయ్ కుమార్ రూ.1.56 లక్షలకు దక్కించుకున్నారు. అదేవిధంగా సంతమార్కెట్ లోని రెండు షాపులకు గాను వేలం ప్రక్రియను నిర్వహించగా కట్టా రాంబాబు రూ.45,100 దక్కించుకున్నారు. అల్లిగూడెం సమీపంలో గల కొబ్బరి చెట్లకు గాను దామెర శెట్టి ఫణి రూ. 73 వేలకు పాడినట్లు కమిషనర్ సుజాత తెలిపారు. ఈ వేలం ప్రక్రియ ద్వారా పురపాలక సంఘానికి రూ.2.74, 100 ఆదాయం సమకూరినట్లు తెలియజేశారు.



# రయ్... రయ్...!

- బాబోయ్ మైనర్ డ్రైవింగ్
- ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్న మైనర్లు
- అతివేగం ఫ్యాషన్ ప్రమాదం జరిగితే తండ్రిపై కేసు
- ఇల్లందు ప్రధాన రోడ్డు బిటి రోడ్డు వల్ల పెరిగిన స్పీడ్
- -స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురి సూచన
- -వాహనాల షాట్స్ తో బెంబే లెత్తిపోతున్న జనం





**ఇల్లందు, మే 7, ప్రజాజ్యోతి:** రయ్...రయ్.. మంటూ మైనర్లు రోడ్లపై దుమ్ము రేపుతున్నారు. వారి వాహనాల వేగానికి పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. మైనర్లకు వాహనం ఇవ్వవద్దని చట్టాలు చెబుతున్న అవి కొంతమంది మైనర్ల తల్లిదండ్రులకు పట్టడం లేదు. తమ బిడ్డ బండి తోలుతున్నాడనే మురిపమే తప్ప జరగరానిది జరిగితే ఎదుర్కొనే పరిణామాలపై ఆందోళన పడటం లేదు. దీంతో రోడ్లపై మైనర్లు దూసుకుపోతున్నారు. పోలీస్ శాఖ నిఘా గట్టిగా ఉన్నా కానీ పట్టణంలోని ప్రధాన రోడ్లు, బస్తీలు, గల్లీలలో వీరి దెబ్బకు అందరు హడలిపోతున్నారు. గతంలో ఇల్లందు ప్రధాన రోడ్డు సీసీ రోడ్డు ఉండడమే కాక గుంతల మయంగా ఉండేది. ప్రస్తుతం ప్రధాన రోడ్డును బిటి రోడ్డు కావడం వల్ల మైనర్లు జోష్ తో ద్విచక్ర వాహనాలను వేగాన్ని అంచనా వేయకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు రవాణా చట్టంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. మైనర్లకు బైక్ ఇచ్చి జరగరానిది ఏదైనా జరిగితే తండ్రిపై కేసు నమోదు చేస్తారు. అంతేకాకుండా శిక్ష కూడా ఉంటుంది. వాహనం ఇచ్చే ముందు అర్హులా..కాదా అనేది తెలుసుకోవాలి.

దీనిపై మరింతగా రవాణా శాఖ అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లలు మారం చేయడం, గారాబం వల్ల బైక్ ఇచ్చి వారికి ఆపదలోకి నెత్తుతుంటారు. కొంతమంది తల్లిదండ్రులు గుంతల రోడ్లపై రయ్ రయ్ మంటూ వెళుతూ ప్రమాదం బారిన పడుతున్నారు. వారు ప్రమాదాల బారిన పడడమే కాకుండా ఇతరుల ప్రాణాల మీదకు తెస్తున్నారు. మైనర్లు వాహనం నడిపి ఇతరుల మరణానికి కారణం అయితే జువైనల్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి విచారణ నిర్వహించి వాహన రిజిస్ట్రేషన్ రద్దు చేయడంతో పాటు రూ.25 వేల జరిమానా విధించడం జరుగుతుంది. వాహనం ఇచ్చిన తండ్రికి మూడేళ్లు జైలు శిక్ష విధించే అవకాశం కూడా ఉంది. అంతే కాకుండా ఈ మధ్య కాలంలో సరికొత్తగా వాహనాల సైలెన్సర్లను మార్చి శబ్దం అధికంగా వచ్చే వాటిని ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు, రోడ్లపై సంచరించే పశువులు మరింత భయానికి గురవుతూ అవి కాస్త జనంపైకి పరుగులు తీయడం వల్ల ఇటు పాదాచారులు, అటు జనం భయ బ్రాంతులకు గురి కావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇల్లందు ప్రధాన రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి మైనర్ల ర్యాష్ డ్రైవింగ్ కు కళ్లెం వేయాలని పలువురు కోరుతున్నారు.

### బండి నడిపేందుకు వీరు అర్హులు

1988 చట్టం ప్రకారం వాహనం నడిపేందుకు వయసు 18ఏళ్ళు నిండి ఉండాలి. ఇంజన్ సామర్థ్యం 50సిసి మించరాదు. వాహనం ఎవరు పేరున ఉంటే వారే నడపాలి. 18 ఏళ్ళు నిండిన వారు నిబంధనలకు విరుద్ధంగా వాహనం నడిపి ఒకరి మృతికి కారకులైతే వారిపై కేసు నమోదు చేసి వారిని జువైనల్ హోమ్ కు తరలిస్తారు. తండ్రిపై హత్య నేరం కింద కేసు నమోదు చేస్తారు. దీనికి ఏడాది నుండి మూడేళ్లు జైలు శిక్ష విధిస్తారు. వాహన రిజిస్ట్రేషన్ రద్దు అవుతుంది.

### మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు: బత్తుల సత్యనారాయణ, సిఐ, ఇల్లందు



మైనర్లకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వాహనాలు ఇవ్వవద్దు. అతివేగం వల్ల ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ మైనర్ల జీవితం నాశనం అవుతుంది. తండ్రిపై సైతం కేసు నమోదు చేస్తారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించవద్దని తల్లిదండ్రులు కొంత గారాభం తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా ఈ మధ్య కాలంలో వాహనాలకు షాట్స్ అనే కొత్త పద్దతిలో రోడ్లపై సంచరించడం జరుగుతుంది. అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం.

# సింగరేణిలో అవినీతి దందాలపై ఉక్కు పాదం

(మొదటి పేజీ తరువాయి...)

సమాచారం తెలియజేస్తే వారిని కూడా ఉక్కుపాదంతో అణిచివేస్తామని సింగరేణి యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. మెడికల్ బోర్డు ప్రక్రియ లో అన్ ఫిట్ చేయిస్తామని, బదిలీలు జరిపిస్తామని, కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన వారిని వైద్య పరీక్షల్లో ఫిట్ చేయిస్తామని, డిప్యూటేషన్లు, ఇంటర్నల్, ఎక్స్ టర్నల్ పరీక్షల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సింగరేణి ఉద్యోగిని మంగళవారం (06.05.2025) అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో సంస్థ ఈ ప్రకటన జారీ చేసింది. అమాయకులైన కార్మికులను వంచిస్తున్న ఎవరినైనా సరే సంస్థ ఉపేక్షించబోదని, కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. అవినీతి చర్యలకు పాల్పడే వారిని, వారికి వెనుక ఉండి సహకారం అందించే వారిని సైతం వదిలిపెట్టే ప్రసక్తే లేదని యాజమాన్యం తెలిపింది. అవినీతికి బలైన బాధితులు, దీనిపై సమాచారం ఉన్న ఏ ఇతర కార్మికులైన, ఇతరులైన సరే సింగరేణి విజిలెన్స్ శాఖకు తెలియ జేయవచ్చని, ఫిర్యాదు దారుల పేర్లను గోప్యంగా ఉంచడమే కాక వారికి సంస్థ పూర్తి రక్షణ కల్పిస్తుందని యాజమాన్యం పేర్కొంది. అలాగే సింగరేణి సంస్థ లో వివిధ పనులు చేయిస్తామని పేరుతో మోసాలకు పాల్పడుతున్న వారి వివరాలు, ఆధారాలు ఇచ్చిన వారికి రూ.10 వేల పారితోషకం కూడా ఇవ్వనున్నట్లు పునరుద్ఘాటించింది. అదే సమయంలో సింగరేణి కార్మికులు తప్పుడు వ్యక్తుల సోపతి పట్టి వక్రమార్గాల్లో పయనించి ఉద్యోగ జీవితాన్ని పాడుచేసుకోవద్దని, ప్రలోభ పెట్టే వారిని దగ్గరకు రానియొద్దని హితవు పలికింది. ఏరియాల్లో, గనుల్లో, డిపార్ట్ మెంట్ లో సింగరేణి ఉద్యోగులు లేదా అధికారులు, లేక బయట వ్యక్తులు ఎవరైనా సరే లంచాలు ఆశిస్తున్నట్లయితే వారి వివరాలను విజిలెన్స్ శాఖకు, ఏసీబీకి అందించి పట్టించాలని యాజమాన్యం సూచించింది. అవినీతిని, అక్రమాలను కూకటివేళ్లతో పెకిలించడానికి, సదరు వ్యక్తులను కటకటాల వెనక్కి నెట్టడానికి సింగరేణి యాజమాన్యం సంసిద్ధంగా ఉందని, సంస్థ పట్ల బాధ్యత గల కార్మికులు ఇందుకు సహకరించాలని, సమాచారం అందించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. అవినీతి అక్రమాలకు పాల్పడే వ్యక్తులు ఎవరైనా సరే, ఏ హోదాలో ఉన్న వదిలిపెట్టేది లేదని యాజమాన్యం స్పష్టం చేసింది. గతంలోనూ సింగరేణిలో అక్రమాలకు పాల్పడిన పలువురు ఉద్యోగులపై విచారణ జరిపి డిస్మిస్ చేసిన విషయాన్ని గుర్తుచేసింది. చట్టప్రకారం పలువురిపై చర్యలు కూడా తీసుకున్నట్లు వెల్లడించింది. ఇకముందు కూడా పారదర్శక సింగరేణి కోసం అక్రమార్కులపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొంది. సింగరేణి సంస్థను అవినీతి రహిత కంపెనీగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు సహకరించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. కొత్తగూడెం విజిలెన్స్ శాఖ వారి ఫోన్ నెంబర్ 94911 44104 కు గాని విజిలెన్స్ శాఖ మెయిల్ ఐడి vig@scclmines.com కు సమాచారం ఇవ్వాలని సూచించింది.

# ఆయువు తీస్తున్న ఆన్లైన్ బెట్టింగ్

(మొదటి పేజీ తరువాయి...)

యువతకు కల్పిస్తారని అన్నారు. యువత మాత్రమే కాకుండా అన్నివర్గాల ప్రజలు ఆన్లైన్లో గేమ్ ల వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోయి తమ జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారని అన్నారు. ఆన్లైన్ గేములు ముందుగానే ప్రోగ్రామింగ్ చేసి ఉంటాయనే విషయాన్ని గ్రహించలేక నిండా మునిగి తెరుకునే లోపు సర్వం కోల్పోతున్నారని అన్నారు.

### లోన్ యాప్ లతో అప్రమత్తంగా ఉండాలి

మనకు అవసరం ఉన్నా, లేకున్నా నిమిషాల్లోనే అప్పులు ఇస్తామంటూ వస్తున్న ఆన్లైన్ లోన్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. సులువుగా తమ ఖాతాలోకి సొమ్ము వస్తుందని లోన్ యాప్ ల నుండి అప్పులు చేసి ఆన్లైన్ బెట్టింగుల్లో, జూదంలో పోగొట్టుకుంటున్న వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతుందని తెలిపారు. ఆన్లైన్ లోన్ యాప్ ల ద్వారా అప్పులు ఇచ్చే కంపెనీలు, అప్పు తీసుకున్న వారి వ్యక్తిగత వివరాలన్నీ సేకరించి వారి వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాయని తద్వారా అమాయకులు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని అన్నారు. ఈ విషయం లో తల్లితండ్రులు తమ పిల్లల దైనందిన కార్యకలాపాలను నిత్యం గమనిస్తూ ఉండాలని ఎస్పీ ఈ సందర్భంగా సూచించారు. బెట్టింగ్ యాప్ లలో లాభాలు వస్తాయన్నది భ్రమ అని గ్రహించాలన్నారు. ఆన్లైన్ బెట్టింగ్ యాప్ లు వాడితే చట్ట ప్రకారం శిక్ష తప్పదని, బాధితుల పైనా కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఎవరైనా ఆన్లైన్ ద్వారా గానీ, నేరుగా గానీ బెట్టింగులకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు.

# ఫలించిన ఎమ్మెల్యే కూనంనేని కృషి

(మొదటి పేజీ తరువాయి...)

రూ.2.92కోట్లు మంజూరుకాగా, చుంచుపల్లి మండలానికి రూ.1.70కోట్లు, సుజాతనగర్ మండలానికి రూ.1.40కోట్లు, లక్ష్మీదేవిపల్లి మండలానికి రూ.1.53కోట్లు, పాల్వంచ మండలానికి రూ.1.37కోట్లు మంజూరు కాగా ఈ నిధులతో 71పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిస్కారం చూపేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. డిఎంఎఫ్టి ద్వారా మంజూరైన రూ.8.92కోట్ల విలువచేసే పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేస్తామని, కాలనికతీతంగా ప్రజలకు నీటిని అందించడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య పరిస్కారంకోసం కృషి జరుగుతోందని, ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేపట్టి ప్రజల నీటి కష్టాలు తీర్చాలని మున్సిపల్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మంజూరైన రూ.8.92 పనులు పూర్తయితే నియోజకవర్గంలో నీటి సమస్య ఉండదని కూనంనేని స్పష్టం చేశారు. నీటి సమస్య పరిస్కారం కోసం పెద్ద మొత్తంలో నిధులు రాబట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.